ఎన్టీఆర్ మార్గంలో కారు బీభత్సం

● స్తంభాన్ని, చెట్టును ఢీకొని ధ్వంసం



ఫుట్‌పాత్‌పై నిలిచిన కారు

ఖైరతాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మార్గంలో ఓ కారు బుధవారం ఉదయం బీభత్సం సృష్టించింది. కారు నడుపుతూ అదుపు తప్పడంతో ఇన్నోవా కారు ఫుట్‌పాత్‌పైకి ఎక్కి, విద్యుత్ స్తంభాన్ని, ఓ భారీ చెట్టును ఢీకొని నిలిచిపోయింది. ప్రమాదం పెద్దగానే జరిగినా అందులోని ఎయిర్ బెలూన్స్ తెరచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సైఫాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ శాలివాహన నగర్ నివాసి అరువుల మధుసూదన్(28) బుధవారం ఉదయం 7 గంటల సమయంలో తెలుగు తల్లి చౌరస్తా నుంచి ఐమాక్స్ వైపునకు ఇన్నోవా కారు(టిజి 09 ఎఫ్ 0707)లో వెళ్తుండగా ఎన్టీఆర్ గార్డెన్ పార్కింగ్ స్థలం వద్ద ఒక్కసారిగా అదుపు తప్పింది. దీంతో ఫుట్‌పాత్‌పైకి ఎక్కి అక్కడున్న ఓ విద్యుత్ స్తంభాన్ని, అక్కడే ఉన్న పాత చెట్టును ఢీకొని నిలిచిపోయింది. కారు ముందు భాగంతోపాటు పలుచోట్ల ధ్వంసం కాగా, కారు లోపలి బెలూన్స్ తెరచుకోవడంతో డ్రైవర్ మధుసూదన్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారును క్రేన్ సహాయంతో అక్కడి నుంచి సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.



సిమెంట్ బెంచీ వద్ద నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, లక్ష్మీభాస్కర్

నిమ్స్‌కు బెంచీలు అందజేత

నిమ్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆవరణలో రోగులు, సహాయకులు కూర్చునేందుకు ఓ దాత 30 సిమెంట్ బెంచీలను సమకూర్చారు. బుధవారం నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్పకు బెంచీలు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. చారుణం లలితమ్మ- భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ గౌరీశంకర్ ద్వారా బెంచీలు విరాళంగా ఇవ్వడాన్ని డైరెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ జీఎస్ సుధాకర్, మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డా. లక్ష్మీభాస్కర్, విద్యాసాగర్, ఆర్ఎంఓ సల్మాన్ పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ పూర్తి

ఖైరతాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఎల్‌వోల శిక్షణ శిబిరాలు బుధవారంతో ముగిశాయి. నియోజకవర్గంలో 247 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ప్రతిరోజూ 50 మంది చొప్పున అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లతోపాటు నియోజకవర్గ ఎన్నికల అధికారి, సర్కిల్-18 ఉపకమిషనర్ సమ్మయ్య శిక్షణ ఇచ్చారు. ఈనెల 3,4,5,7,8,15,23 తేదీల్లో చింతలబస్తీ డిగ్రీ కళాశాలలో శిక్షణా శిబిరాలు జరిగాయి. ఓటరు జాబితాలను ప్రకాశన చేసే క్రమంలో జాగ్రత్తగా ఉండాలని శిక్షకులు బీఎల్‌వోలకు సూచించారు. ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగించే ప్రక్రియ నిబంధనల ప్రకారం జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పుగా పేర్లను తొలగించడం చేయరాదని సూచించారు. కాగా, 247 పోలింగ్ స్టేషన్లకు గాను అన్నింటిలో పర్మినెంట్ బూత్ స్థాయి అధికారులను నియమించగా, అందులో దాదాపు 15 మంది ఇప్పటి వరకు శిక్షణకు హాజరు కాలేదని, వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని ఎన్నికల అధికారి సమ్మయ్య తెలిపారు. శిక్షణ శిబిరంలో మాస్టర్ ట్రైనర్లతో పాటు డిగ్రీ కళాశాల ప్రొఫెసర్లు, ఖైరతాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

బోరబండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ బోరబండలో విజయవంతమైంది. ప్రైవేట్ విద్యాసంస్థలకు బుధవారం సెలవు ప్రకటించగా, ప్రభుత్వ పాఠశాలలను భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ), డీవైఎఫ్ఐ నేతలు మూసేయించారు. అనంతరం బోరబండ బస్టాపు వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి సునీల్ పవార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా శాఖ ముఖ్యమంత్రి వద్దనే ఉన్నదని, తద్వారా విద్యారంగం సమస్యల వలయంలో చిక్కుకుందని ఆరోపించారు. వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి కృష్ణ, ఎస్ఎఫ్ఐ నేతలు మనోజ్, వెంకట్, జగదీశ్, సిద్దు పాల్గొన్నారు.

ఖబరస్తాన్‌కు స్థలం కేటాయించాలి



అజ్మతుల్లా హుస్సేనికి వినతిపత్రం ఇస్తున్న అజారుద్దీన్

బంజారాహిల్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఖబరస్తాన్ కోసం స్థలం కేటాయించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్ కోరారు. బుధవారం ఆయన వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజారుద్దీన్ మాట్లాడుతూ శ్రీరాంనగర్ బస్తీని ఆనుకొని సంజయ్‌నగర్‌లో ఉన్న గ్రేవియార్డు సరిపోవడం లేదని, అక్కడ పక్కనే క్వారీ స్థలంలోని కొంత భాగాన్ని ఖబరస్తాన్ కోసం కేటాయించాలని కోరారు. త్వరలోనే అక్కడ పర్యటించి స్థల లభ్యతను గుర్తించి సమస్యను పరిష్కరిస్తామని అజ్మతుల్లా హుస్సేని హామీ ఇచ్చారు.



శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందిన వారితో నిర్వాహకులు

కంప్యూటర్ సర్టిఫికెట్ల ప్రదానం

అమీర్‌పేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కమ్మసంఘం అమీర్‌పేట ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ ద్వారా కంప్యూటర్ బేసిక్స్‌లో 60 రోజులు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. 70 మంది అభ్యర్థులకు శిక్షణ పూర్తవడంతో బుధవారం సంస్థ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 4వ తేదీ నుంచి ఆసక్తి గల వారికి కంప్యూటర్ శిక్షణ ఇస్తామని, వివరాలకు 9849566945, 9177661161లో సంప్రదించాలని సూచించారు.

ఫైరింజన్ వెళ్లేదెలా?

కార్యాలయం ఎదుట అడుగడుగునా గోతులు.. పట్టించుకోని అధికారులు



మాదాపూర్ అగ్నిమాపక కేంద్రం వద్ద రహదారి

హైటెక్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ అగ్నిమాపక కేంద్రం ఎదుట రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఇందులో నీరు నిలుస్తుంది. దీంతో ఏదైనా ప్రమాదం జరిగితే అగ్నిమాపక వాహనం వేగంగా వెళ్లే వీలు లేదు. ఇందుకు తాగునీటి ట్యాంకర్లే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

మాదాపూర్ అగ్నిమాపక కేంద్రం సమీపంలో తాగునీటి ప్లాంట్ ఉంది. ఇక్కడ నుంచి ప్రతీ రోజూ 500 ట్యాంకర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సమయంలో నీరు రోడ్డుపై పారుతున్నాయి. ఇక్కడి నుంచి ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కార్యాలయం ఆవరణలోకి నీరు వెళ్తుంది. దీంతో అక్కడి ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు.

ఆరు నెలలుగా సమస్య..

ఆరు నెలలుగా రహదారి మొత్తం శిథిలమైందని తమపై అధికారికి వివరించామని మెట్రో వాటర్ సర్వీసు ఉద్యోగులు చెబుతున్నారు. ట్యాంకర్ల ద్వారా ఇక్కడి నుంచి ఇళ్లు, హాస్టళ్లు, ఫంక్షన్‌హాళ్లకు తాగునీరు సరఫరా చేస్తామని, రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో తమ వాహనాల టైర్లు గుంతల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయని వారు చెబుతున్నారు.

వర్షం వస్తే సమస్య మరింత తీవ్రం

వర్షం వస్తే ఈ మార్గంలో వెళ్లలేక పోతున్నామని, బురద నీరంతా రహదారిపై చేరడంతో ద్విచక్ర వాహనాలు వర్షం నీళ్లలో మునిగి పోతున్నాయని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తెలిపారు. వేలమంది ఐటీ ఉద్యోగులు రాకపోకలు సాగించే రహదారికి మరమ్మతులు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారుల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ పాఠశాలల చెంత
ప్రమాదకర గుంత

బోరబండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బోరబండ బలహీనవర్గాల కాలనీ పెద్దమ్మ నగర్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. మురుగునీరు పొంగిపొర్లుతున్న కాల్వను మరమ్మతుల కోసం అధికారులు తవ్వడం వల్ల పెద్దగుంత ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల చెంత ప్రమాదకరమైన గుంత ఏర్పడడంతో ప్రజలు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి రోజూ వేలసంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ ప్రాథమిక, నాట్కో ప్రభుత్వోన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వస్తుంటారు. దాదాపు 2వేల మంది విద్యార్థులతో రాష్ట్రంలోనే పెద్ద పాఠశాలగా గుర్తింపు పొందిన నాట్కో ప్రభుత్వోన్నత పాఠశాలకు వంద అడుగుల దూరంలో ఏర్పడిన గుంతకు మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యాలయాలకు వెళ్లే తొందరలో గుంతలో పడి విద్యార్థులు గాయాలపాలయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



పెద్దమ్మనగర్ ప్రధాన రహదారిపై ప్రభుత్వ పాఠశాలల చెంత ఏర్పడిన గుంత

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

ఖైరతాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అధికారులు అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. ఒకేరోజు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నాలుగు భవనాల్లో పనులు నిలిపివేసి సీజ్ చేశారు. సర్కిల్-18 ఉపకమిషనర్ సమ్మయ్య ఆదేశాల మేరకు ఫిలింనగర్ రోడ్డునెంబర్.13 లోని ప్లాట్ నెంబర్.51 నివాస భవనంగా అనుమతి తీసుకొని జి ప్లస్ 5 అంతస్తుల్లో గీతాంజలి మోడల్ స్కూల్‌ను నిర్వహిస్తుండడంతో ఆ భవనాన్ని సీజ్ చేశారు. షేక్‌పేట వెటర్నరీ కాలనీలో అనుమతి లేకుండా 5వ అంతస్తును నిర్మించడం, సెట్ బ్యాక్‌లు లేకుండా ఉండడం, అనుమతి లేకుండా సెల్లార్‌ను నిర్మించడంతో సీజ్ చేశారు. జూబ్లీహిల్స్‌లో ఓ మీడియా సంస్థ కార్యాలయం ఎదురుగా అనుమతి లేకుండా నిర్మించిన సిల్ట్ ప్లస్ 4 అంతస్తుల భవనాన్ని సీజ్ చేశారు. దీంతోపాటు బంజారాహిల్స్ దుర్గానగర్ కాలనీలో అనుమతి పొందిన దానికంటే ఓ అంతస్తు ఎక్కువ నిర్మించడంతోపాటు పెంట్‌హౌజ్ నిర్మించిన భవనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. మధ్యవర్తులకు భవన నిర్మాణాల్లో ఎలాంటి ప్రమేయం ఉండదని, ఏ సమస్య వచ్చినా నేరుగా తమ అధికారులనుగాని, తనను గాని సంప్రదించాలని సూచించారు.

గురుకుల విద్యాసంస్థల్లో సమస్యలను పరిష్కరించాలి




రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆనంద్‌గౌడ్, దివాకర్, తదితరులు

పంజాగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలను, ఫుడ్ పాయిజన్‌ను అరికట్టాలని అన్నారు. ఈ మేరకు బుధవారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు సురేందర్, ఆర్.జయప్రకాష్, ఆర్.బాలలక్ష్మిలను కలిసి వినతిపత్రం అందజేశారు. 90 శాతం గురుకులాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ అత్యధిక శాతం గురుకులాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు మానసిక ఇబ్బందులతో చదువు మానేయడం, ఆత్మహత్యలకు పూనుకుంటున్నారని, వెంటనే బీసీ కమిషన్ ద్వారా గురుకులాల్లో సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం తగు చర్యలు తీసుకునేలా జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రతీ గురుకులానికి ఒక పేరెంట్స్ కమిటీ, అందులో ప్రభుత్వ పరంగా ఒక అధికారిక కమిటీ వేసి ప్రతీ నెల రెండుసార్లు సమావేశం నిర్వహించి అక్కడి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని అన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని, చికిత్స పొందుతున్న విద్యార్థులకు తగిన ఆర్థిక సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, నాయకులు పూస రాజు, పి.వెంకటేష్, జక్కలి రాజు, రాజునేత పాల్గొన్నారు.

రెండు రోజుల్లో నాలా సమస్యకు పరిష్కారం

● కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



బసవతారకంనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

బంజారాహిల్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నాలా వల్ల కలిగే ఇబ్బందులకు రెండు రోజుల్లో పరిష్కారం చూపిస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఫిలింనగర్ బసవతారకంనగర్‌లో నాలా పొంగి వరదనీరు బస్తీలోకి ప్రవహిస్తున్నాయి. దీని వల్ల ఇళ్లు మునిగిపోయే ప్రమాదం పొంచి ఉందనే ఫిర్యాదుల మేరకు ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బుధవారం బస్తీలో పర్యటించారు. సమస్యను పరిశీలించారు. అనంతరం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. స్థానికులు అనేక అగచాట్లకు గురవుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మెడల్స్

వెంగళరావునగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు కాలనీ జేఎన్‌టీయూ వద్ద ఉన్న ఎస్.ఎల్.వి ప్రో అకాడమీలో ఇంటర్ స్కూల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025 జరిగింది. మధురానగర్ కాలనీలోని డీసీహెచ్ఎస్ఎన్ రాజు ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి వివిధ కేటగిరీలలో మెడల్స్ సాధించారు. అండర్ -9 బాలుర విభాగంలో సీహెచ్ దర్శిత్ సింగిల్స్, డబుల్స్‌లో మొదటి స్థానం, టి.నోర్థ్ మూడో స్థానం, అండర్-11 బాలుర విభాగంలో ఎం.హర్షిత్‌రెడ్డి రెండోస్థానం, బాలికల విభాగంలో బి.సాయి దీక్ష మూడోస్థానం, అండర్-13,15,17 బాలుర విభాగంలో ఎం.హర్షిత్‌రెడ్డి రెండోస్థానం , బాలికల విభాగం డబుల్స్‌లో జి.తన్మయిశ్రీ మూడో స్థానంలో నిలిచి మెడల్స్ సాధించారు. వీరిని బుధవారం మధురానగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, కోశాధికారి సుగుణ, సంయుక్త కార్యదర్శి హనుమంతరావు యాదవ్, కోచ్, తోటి క్రీడాకారులు అభినందించారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

బంజారాహిల్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్‌లో ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు బొప్పారం వేణుకుమార్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాల మధ్య జరిగిన ఘటాల ఊరేగింపు, భారీ అమ్మవారి విగ్రహాల ఊరేగింపులో బస్తీవాసులు భారీగా పాల్గొన్నారు.

రాజ్యాధికార అస్తిత్వ ఉద్యమంలో
బీసీ జర్నలిస్టులు భాగస్వాములు కావాలి

పంజాగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బీసీ జర్నలిస్టులు సంఘటితమై రాష్ట్రంలో జరుగుతున్న రాజ్యాధికార అస్తిత్వ ఉద్యమంలో భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. బీసీ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రసార మాధ్యమాల్లో అత్యధికంగా బీసీ జర్నలిస్టులే పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ఆన్‌లైన్ పేపర్లు, చిన్న పత్రికలు, యూట్యూబ్ చానల్స్‌లో సైతం బీసీ జర్నలిస్టులే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. అర్హులైన వారందరికీ అక్రెడిటేషన్లు, చిన్న పత్రికల వారికి ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సరైన శిక్షణ లేక గ్రామీణ, మండల ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు కేవలం జిల్లాస్థాయికే పరిమితమవుతున్నారన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ తరఫున బీసీ జర్నలిస్టుల కోసం రెండు రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించాలని, తద్వారా సీఈవో, ఎడిటర్లుగా ఎదిగేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. బీసీ జర్నలిస్టుల ఐక్యతను చాటుతూ త్వరలోనే పది వేల మందితో సభను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జేఏసీ, వివిధ బీసీ జర్నలిస్టు సంఘాల నాయకులు కొత్త లక్ష్మణ్ పటేల్, మేకల కృష్ణ యాదవ్, జి.శ్రీనివాస్, నీలకంఠం ముదిరాజ్, వెంకట్ పటేల్, సత్యనారాయణ, జానకిరామ్, సీనియర్ జర్నలిస్టులు సంపత్, శ్రీనివాస్, ఎం.ప్రభాకర్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సార్కోమా వ్యాధిపై అవగాహన ఉండాలి

బంజారాహిల్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎముకలు, సాఫ్ట్ టిష్యూలో ఏర్పడే అరుదైన క్యాన్సర్ సార్కోమా వ్యాధిపై ప్రజల్లో అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని అపోలో క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పి.విజయ్‌ఆనంద్ రెడ్డి అన్నారు. బోన్ క్యాన్సర్‌ను జయించిన పలువురిని అపోలో క్యాన్సర్ సెంటర్‌లో బుధవారం వైద్యులు సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తిస్తే చికిత్స ద్వారా అరికట్టవచ్చని తెలిపారు. ఆర్థోపెడిక్ అంకాలజిస్టు డా. రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ బోన్ క్యాన్సర్ చికిత్సలు క్లిష్టమైనవే కాక శారీరకంగా చాలా కష్టతరమైనవన్నారు. ఈ వ్యాధిని ఎదుర్కొని అసాధారణమైన దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు, డా.నిఖిల్ సురేశ్ (డైరెక్టర్ మెడికల్ అంకాలజీ), డా. కె.జె.రెడ్డి, డా.సుబ్బారెడ్డి, డా.అజేష్ రాజేశ్ సక్సేనా, డా.రాము దాములూరి, డా.శ్రీనాథ్ భరద్వాజ్ పాల్గొన్నారు.



బోన్ క్యాన్సర్‌ను జయించిన వారితో అపోలో వైద్యులు

పార్కుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



పవర్‌బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

బేగంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పార్కుల అభివృద్ధిలో స్థానికులు భాగస్వాములు కావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం సనత్‌నగర్ డివిజన్‌లోని మూడు పార్కుల్లో సుమారు రూ.20 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన పవర్ బోర్లను కార్పొరేటర్ కొలను లక్ష్మీతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులతోపాటు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు ఖలీల్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

రాములుకు దత్తాత్రేయ నివాళి

బోరబండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు, రహ్మత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి లక్ష్మణ్ తండ్రి రాములు చిత్రపటానికి హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నివాళులర్పించారు. మోతీనగర్ ప్రాంతంలోని రాయల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం రాములు సంతాప సభ నిర్వహించారు. వివిధ పార్టీలు, సంఘాలకు చెందిన ప్రతినిధులు రాములు చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డా.ఎన్.గౌతమ్‌రావు, ఉపాధ్యక్షుడు కిలారి మనోహర్, అట్లూరి రామకృష్ణ, కొలన్ సత్యనారాయణ, సుప్రియాగౌడ్, ఎస్.మల్లేశ్‌గుప్తా, కొత్త వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకుడు రావుల శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గ్యార నాగరాజు, శివ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

చివరి వరకు ప్రజల కోసమే మాగంటి

బంజారాహిల్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చివరి క్షణం వరకు ప్రజల కోసం బతికారని ఆయన సోదరుడు మాగంటి వజ్రనాథ్ అన్నారు. ఎల్లారెడ్డిగూడ నాగార్జుననగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం మాగంటి సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వజ్రనాథ్ మాట్లాడుతూ తన సోదరుడి మరణం తర్వాత కార్యకర్తలు మనోవేదనకు గురవుతున్నారని, వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పేందుకు సభ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మాగంటి గోపీనాథ్ లేని లోటును ఎవరూ పూడ్చలేరని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జైలు

బంజారాహిల్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జైలు శిక్ష పడింది. వీకెండ్ సందర్భంగా గత వారం బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చారు. వీరిలో జుబేర్ ఉమర్ ఫరోక్యూ అన్సారీకి నాలుగు రోజులు, కుమార్, నాగార్జునరెడ్డి, కసి ముఖ్యలకు రెండేసి రోజులు జైలు శిక్ష పడిందని, చంచల్‌గూడ జైలుకు తరలించామని బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ తెలిపారు.

జీరా బస్తీ.. గుంతలతో కుస్తీ

అంతర్గత రహదారులు అస్తవ్యస్తం


జీరా బస్టాప్ పక్కదారిలో


జీరా బస్తీ వద్ద రహదారి

రాంగోపాల్ పేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నగరం నడిబొడ్డులోని బస్తీ అది. కానీ ఆ బస్తీలో అంతర్గత రహదారులు మాత్రం ఎప్పుడూ గుంతలమయమే. అదే సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని రాంగోపాల్‌పేట్ డివిజన్ జీరాబస్తీ. ఈ బస్తీవాసులు చాలాకాలంగా అధ్వానంగా మారిన అంతర్గత రహదారులతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారులు పూర్తిగా ధ్వంసమై, గుంతలతో నిండిపోయి, ప్రజలకు నిత్యం అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది.

బస్తీలోని అంతర్గత రోడ్లు పెద్ద గుంతలతో నిండి ఉన్నాయి. గతంలో ఇక్కడ పైప్‌లైన్లు వేశారు. వాటిని సరిగ్గా పూడ్చకపోయేసరికి ఆ రహదారులు గుంతలతో నిండిపోయాయి. దీనితో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆరోగ్య సమస్యలు

వార్షాకాలం కావడంతో గుంతలు తేలిన ఆ రహదారిలో వర్షం, మురుగు నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలడానికి కారణమవుతుంది. ఇది బస్తీ నివాసితుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమించింది.

స్థానికుల ఆవేదన

రోడ్ల మరమ్మతుల కోసం బస్తీవాసులు అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. తమ సమస్యలను పట్టించుకోవడం లేదని, ప్రజాప్రతినిధులు కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి, అంతర్గత రహదారులకు మరమ్మతులు చేయాలని, స్థానిక ప్రజల కష్టాలను తీర్చాలని బస్తీ నివాసితులు కోరుతున్నారు.


జీరా హనుమాన్ దేవాలయం వద్ద రహదారి



జీరా ప్లేగ్రౌండ్ వద్ద వేసిన శిలాఫలకం

అంతర్గత రహదారులు వేయాలి



సంవత్సరాలుగా అంతర్గత రోడ్లు గుంతలమయమై ఇబ్బందులు పడుతున్నాం. రాత్రిళ్లు ఈ గుంతల రోడ్ల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్లను నిర్మించి స్థానిక బస్తీవాసులను ప్రమాదాల నుండా కాపాడాలి.

- నర్సింగరావు, బస్తీవాసి

అడ్డుకోవడం వల్ల ఆగిపోయింది



గతంలో అసెంబ్లీ ఎన్నికల ముందు నాటి మంత్రి, ప్రస్తుత సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానిక కార్పొరేటర్‌తో కలిసి వీడీసీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానికంగా కొందరు అడ్డుకోవడం వల్ల పనులు నిలిచిపోయాయి. త్వరలో రోడ్లను వేస్తామని అధికారులు అంటున్నారు.

- అభిషేక్, బస్తీవాసి

రోడ్లను నిర్మిస్తాం



గతంలో జీరా బస్తీలో అంతర్గత రహదారులు వేయడానికి అంతా సిద్ధమై, శిలాఫలకం కూడా వేయడం జరిగింది. కొందరు బస్తీవాసులు వీడీసీసీ రోడ్డు వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకదని రోడ్డు నిర్మాణాన్ని వ్యతిరేకించారు. దీంతో గుత్తేదారు వెళ్లిపోవడం, నిధుల గడువు ముగిసిపోవడం జరిగింది. ప్రస్తుతం డాంబర్ రోడ్డు వేయడానికి టెండర్ ప్రక్రియ కావాల్సి ఉంది. త్వరలోనే అంతర్గత రహదారులను నిర్మిస్తాం.

- చీర సుచిత్ర శ్రీకాంత్, కార్పొరేటర్


పద్మారావుగౌడ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ప్రమోద్‌కుమార్

ఫలహార బండి ఊరేగింపునకు ఆహ్వానం

సికింద్రాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తో పాటు జంటనగరాల్లో ప్రసిద్ధి చెందిన బాలంరాయి దండుమారమ్మ బోనాల జాతర వేడుకల్లో భాగంగా 27న సాయంత్రం నిర్వహించే ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమానికి రావాల్సిందిగా సికింద్రాబాద్ శాసనసభ్యుడు, మాజీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్‌ను ఫలహార బండి నిర్వాహకులు బీ.ఏ.ప్రమోద్‌కుమార్ ఆహ్వానించారు. చాలా సంవత్సరాలుగా తాము ఫలహార బండి ఊరేగింపును అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా ఊరేగింపు ఉంటుందని ప్రమోద్‌కుమార్ వెల్లడించారు. వేలాది మంది భక్తులు హాజరవుతారని తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కూడా పాల్గొన్నారు.


వెంకటేశ్వరనగర్‌లో సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా : కార్పొరేటర్

బౌద్ధనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో బుధవారం జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. నూతన సీసీ రోడ్డు పనులు జరుగుతున్నందున స్థానికంగా కొంతమందికి నల్లా కనెక్షన్ లేకపోవటంతో వారు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మారేడుపల్లి జలమండలి జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్, అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించిన స్థానిక సమస్యలపై చర్చించారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కారిస్తానని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌నగర్ సెక్షన్ మేనేజర్ నవ్య, నాయకుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ లీకేజీపై డీఆర్‌ఎంకు ఫిర్యాదు


రైల్వే డీఆర్‌ఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : తుకారాం గేట్ చౌరస్తాలో ఉన్న ఆర్‌యూబి బ్రిడ్జి చిన్నపాటి వర్షానికే నీరు లీకేజీ అవుతుందని మరమ్మతులు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నర్సింగ్‌రావుతో పాటు గంగారాం, శేషచారి, రాజారాంలు బుధవారం దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం అధికారి లోకేష్ విశనోయ్‌కు వినతిపత్రం సమర్పించారు. తుకారాంగేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకుడు నర్సింగ్‌రావు మాట్లాడుతూ తుకారాంగేట్ చౌరస్తా లాలాగూడ రైల్వేస్టేషన్ వద్ద రూ.72 కోట్లతో నిర్మించిన ఈ బ్రిడ్జి చిన్నపాటి వర్షానికే లీకేజీ అవుతుందని దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని డీఆర్‌ఎంకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. అదేవిధంగా ఇదే అంశంపై సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌కు కూడా వినతిపత్రం సమర్పించామన్నారు.


అడ్డగుట్టలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా దళిత బహుజన ఫోరం, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఈ శిబిరంలో దాదాపు వందమంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫోరం రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, సికింద్రాబాద్ జోన్ సీపీఎం కార్యదర్శి ఆర్.మల్లేష్‌లు పాల్గొన్నారు.

సెయింట్ మేరీ సెంటినరీ కాలేజీలో ఎంబీఏ ప్రాజెక్ట్ ఎక్స్‌పో


ఎంబీఏ విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ జహంగీర్

అడ్డగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సెయింట్ మేరీ సెంటినరీ కాలేజీలో బుధవారం నిర్వహించిన ఎంబీఏ ప్రాజెక్ట్ ఎక్స్‌పో కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉస్మానియా విశ్వ విద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాహంగీర్, పాల్గొని ఎంబీఏ విద్యార్థులతో ఎక్స్‌పో అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంథోని వినయ్‌లు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తుల మృతి


గుర్తుతెలియని వ్యక్తి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబరు 4లో మంగళవారం గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీలో భద్రపరిచారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో..


గుర్తుతెలియని వ్యక్తి

అడ్డగుట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి చనిపోయిన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ గేటు నంబరు-2 వద్ద గుర్తుతెలియని 38 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ అంతరాయాలకు చెక్.. ఉన్నతాధికారుల విస్తృత పర్యటన


విద్యుత్ సమస్యల పరిష్కారానికి పార్సీగుట్ట సెక్షన్‌లో పర్యటించిన చీఫ్ ఇంజనీర్ సాయిబాబా, గోపయ్య తదితర అధికారులు

సికింద్రాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలకు చెక్ పెట్టాలని విద్యుత్‌శాఖ అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా ప్యారడైజ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విస్తృతంగా పర్యటించారు. అంతరాయం కలగడానికి కారణాలు, పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేశారు. ప్యారడైజ్ డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఫిర్యాదులు రావడంతో మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్(ఆపరేషన్స్) సాయిబాబా, సికింద్రాబాద్ ఎస్ఈ(ఆపరేషన్స్) గోపయ్య, ప్యారడైజ్ డివిజనల్ ఇంజనీర్ బ్రహ్మానందం, డీఈ(టెక్నికల్) వెంకటాచారి, డీఈ (కన్‌స్ట్రక్షన్) జయరాములు, డీఈ(ఎంఆర్‌టీ) రమణారావు, పద్మారావునగర్ ఏడీఈ మహేష్‌కుమార్, పార్సీగుట్ట ఏఈ రవీనా, పద్మారావునగర్ ఏఈ రాజు, సీతాఫల్‌మండి ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, లాలాగూడ ఏఈ సుధాకర్‌రెడ్డి తదితర సిబ్బంది పార్సీగుట్ట సెక్షన్‌లోని వసంతపూర్, సున్నంబావి, రాఘవేంద్రగార్డెన్, జమిస్తాన్‌పూర్ సబ్ స్టేషన్, రాఘవ గార్డెన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి, అంతరాయం కలగడానికి దారితీస్తున్న కారణాలను పరిశీలించారు. సమస్యలను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కాగా కొన్ని చోట్ల విద్యుత్ తీగలకు చెట్లు, చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండడంతో వాటిని తొలగించాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవాటిని ఏర్పాటు చేయాలని చీఫ్ ఇంజనీర్ సాయిబాబ స్థానిక అధికారులను ఆదేశించారు.

బోయినపల్లిలో చిన్న వర్షానికే రోడ్లు చిత్తడి


మురుగు బురదతో నిండిపోయిన మర్రి రామ్ రెడ్డి కాలనీ


బురదమయంగా మారిన సంతోష్ పూరి కాలనీ రోడ్

బోయినపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు కంకర తేలిన రోడ్లు... మరో వైపు గుంతల రోడ్లు... ఇంకో వైపు బురద రోడ్లు బోయినపల్లిలో రోడ్ల పరిస్థితి ఇది. ఇంతే ప్రధాన రహదారులు కాలనీ అనే తేడా లేదు. రహదారులన్నీ ప్రమాదకరంగా మారాయి. కంటోన్మెంట్ ఆరో వార్డు పరిధిలోని మర్రి రామ్‌రెడ్డి కాలనీ, సంతోష్‌పూరి కాలనీ, సీతారంపురంలలోని రోడ్ల పరిస్థితి నాయకులు మారినా ప్రభుత్వాలు మారినా దుస్థితి మారలేదు.

చిన్న వర్షం పడిందంటే చాలు ఈ ప్రాంతంలోని ప్రధాన రహదారిలో మురుగుతో కూడుకున్న బురద పెద్దఎత్తున పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇవే రోడ్ల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు వెళ్తున్నా వాటి మరమ్మతును మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించండి


వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో కలెక్టర్ మనుచౌదరి

మల్కాజిగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, వైద్యం కోసం వచ్చేవారి పట్ల ఉదాసీనంగా ఉంటూ వారికి వైద్యం అందించాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి వైద్యులకు సూచించారు. బుధవారం ఆయన మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అక్కడ అందుతున్న వైద్యసేవలతో పాటు ఆస్పత్రిలో కల్పించాల్సిన సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సదుపాయాల కల్పనకు త్వరలోనే టెండర్లను ఆహ్వానించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని అన్ని వార్డులు, ఆపరేషన్ థియేటర్లతో పాటు కోవిడ్ పేషంట్ల కోసం ఏర్పాటు చేసిన నూతన సముదాయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా, ఆర్డీవో శ్యాం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభ, తహసీల్దార్ సీతారాం, మెడికల్ సపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ సంగీత్, జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఉపకమిషనర్ జకియా సుల్తానా, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన కలెక్టర్

నేరేడ్‌మెట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వినాయకనగర్ డివిజన్ పరిధిలోని వాజ్‌పేయ్‌నగర్‌లోని మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరీ బుధవారం సాయంత్రం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా రెవెన్యూ అధికారులు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి, వెంటనే 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు డాక్టర్ జంపాల రాజేష్ హాజరై సంతకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు వాఖ్యలను ఖండించారు. బీసీ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ కోటాను, మండల్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. 50శాతం నిధులతో బీసీ సబ్ ప్లాన్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి బిల్లును ఆమోదించే విధంగా రాష్ట్ర బీజేపీ ఎంపీలు బాధ్యత తీసుకోవాలని, లేదంటే తెలంగాణ బీసీల దృష్టిలో దోషులుగా మిగిలిపోతారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీఎస్‌ఎఫ్ నాయకులు భూషణ్, శేఖర్, విక్రమ్, లింగయ్య, అభి, శంకర్, మధు, గణేష్, సంతోష్, ప్రవీణ్, సురేష్, శ్రీధర్, నవీన్, కార్తీక్, చందు, సంతోష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


పవర్‌బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

బేగంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పార్కుల అభివృద్ధిలో స్థానికులు భాగస్వాములు కావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం సనత్‌నగర్ డివిజన్‌లోని మూడు పార్కుల్లో సుమారు రూ.20 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన పవర్ బోర్లను కార్పొరేటర్ కొలను లక్ష్మీతో కలిసి ఆయన ప్రారంభించారు. కారక్రమంలో పలు విభాగాల అధికారులతోపాటు బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు ఖలీల్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహం బహూకరణ

వారాసిగూడ చౌరస్తాలో బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ. అనంతరం రవిప్రసాద్‌గౌడ్ దంపతులకు స్వామివారి విగ్రహాన్ని బహూకరించిన మాజీ గవర్నర్. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి

దండు మారమ్మ ఆలయానికి ఇత్తడి ముఖద్వారం


దండు మారమ్మ ఆలయ ముఖద్వారం వద్ద బి.ప్రభాకర్ కుటుంబ సభ్యులు

సికింద్రాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారంగా, కోరిన కోరికలు తీర్చే అమ్మవారిగా విరాజిల్లుతున్న బాలంరాయి దండుమారమ్మ ఆలయ ముఖద్వారం కొత్త రూపు సంతరించుకుంది. ఇత్తడితో ఆలయ ముఖద్వారానికి కొత్త రూపు వచ్చింది. కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి మాజీ సభ్యుడు బి.ప్రభాకర్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి బి.అనితప్రభాకర్, సోదరుడు బి.శ్రీనివాస్, కుమారుడు బి.సాయికిరణ్‌ల సహకారంతో దండు మారమ్మ గర్భాలయ ముఖద్వారానికి పెంబర్తిలోని ఇత్తడి వస్తువులు తయారు చేసే కళాకారులతో రూ.2.20లక్షల వ్యయంతో ఇత్తడి ముఖద్వారం తయారు చేయించారు. దేవాదాయశాఖ అధికారుల అనుమతితో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు సాయికిరణ్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ తదితరులు

ఉప రాష్ట్రపతిగా దక్షిణాది దళితులకు అవకాశం ఇవ్వాలి

తార్నాక, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఉప రాష్ట్రపతిగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన దళిత సామాజికవర్గానికి చెందిన వ్యక్తికే అవకాశం కల్పించాలని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం తార్నాకలోని దక్షిణాది జేఏసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కేంద్రం డీలిమిటేషన్ పేరుతో ద్రోహం చేస్తుందని, కీలకమైన పదవులన్నీ ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారికే ఇచ్చారని, దక్షిణాది రాష్ట్రాలకు మొండి చెయ్యి చూపించారని తీవ్రంగా మండిపడ్డారు. మధ్య భారతదేశం నుంచి బీసీ ప్రధానమంత్రిగా అవకాశం ఇచ్చారని, రాష్ట్రపతిగా ఉత్తరాది నుంచి ఆదివాసీ మహిళలకు అవకాశం కల్పించారని, స్పీకర్‌గా ఓసీకి అవకాశం ఇచ్చారని, అయితే ఉప రాష్ట్రపతిగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన దళితులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణాది జేఏసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోయ శంకర్, చుక్క శంకర్, కుసపాటి శ్రీనివాస్ మాదిగ, మురళి తదితరులు పాల్గొన్నారు.



మర్యాద పూర్వక కలయిక

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీశాఖ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి బుధవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఆయన కార్యాయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాజేందర్, రమేష్, శివాజీ, ప్రకాష్, శ్రీనివాస్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి